# ఋతుప్రేమలు

-సి. వివేక్

“కాలానుగుణంగా ఋతువులు మారుతుంటాయి. అలాగే కాలక్రమేణ మనుష్యుల ప్రేమలలో మార్పు వుంటుంది. బాల్యంలో తల్లి, తండ్రి పై ప్రేమ. అన్నపై ప్రేమ, చెల్లిపై ప్రేమ. ఆ తర్వాత ప్రియురాలిపై ప్రేమ. భార్యపై ప్రేమ. కన్నపిల్లాడిపై ప్రేమ కాని మనిషి ప్రేమకు అర్థం మరోరకంగా వుంది ఈ రోజుల్లో.... ప్రపంచీకరణలో 'ప్రేమ' ఒక 'పావు' అయింది. ప్రేమ - ఒక టైంపాస్, ఒక తోడు. చిట్‌చాట్, సరదా... ప్రేమ ఒకరితో... పెళ్లి మరొకరితో.

ఋతువులు మారినట్టు ప్రేమలు మారిపోతున్నాయి.

“ఎవరి గురించి, నువ్వు మాట్లాడుతున్నార్రా..” అన్నాడు సాంబశివరావు.

“ఈ మధ్య పార్క్ ప్రేమల గురించి ” అన్నాడు కోదండపాణి. పార్క్‌లో ఒక మూల బెంచిపై కూర్చుంటూ.

పార్క్‌నిండా చిన్న పిల్లల అరుపులు, కేరింతలు, మరోపక్క చీకటి పడే కొద్దీ యువ జంటలు పార్క్‌లలో ప్రవేశం... చెట్ల మాటున పొదల చాటున గుసగుసలు... పకపకలు... యికయికలు.... ఆవూరి చివర వున్న పెద్ద పార్క్ అదే....

పార్క్ చివరగా రెండు పెద్ద బాదం చెట్లు. ఒక బుద్ద పూల చెట్టు వుంది. వసంత ఋతువు చెట్లు చిగిర్చి వున్నాయి. బుద్ద పూలు రాలుతుంటాయి. ఆ బుద్ద పూల కోసం పిల్లల కేరింతలు, ఏరుకొని పూల రేకును రెండు వ్రేళ్ళతో నొక్కి నోట్లో పెట్టి గాలి దింపి వాటిని తలకేసి బాదుకుంటారు. అదీ“టప్” మంటూ శబ్దం వస్తుంది. సరదాగా సాగుతుంది వారి ఆట.

కాసేపు అయ్యాక “ఆ జంటను చూశావా!” అన్నాడు కోదండపాణి.

“ఆ... రోజూ వచ్చేవారేగా... కొత్తగా ఏముంది?” అన్నాడు సాంబశివరావు.

“అక్కడే పొరపాటుబడ్డావు... కుర్రాడు ఒకటే... కుర్రది మారింది”.

“ఏమో బాబు... అంతగా గమనించలేదు” అన్నాడు సాంబశివరావు.

“ఒరే కోదండం... ఆ టాపిక్ మార్చి మరే విషయమన్నా మాట్లాడు” అన్నాడు కాస్త విసుగ్గా... సాంబశివరావు.

కోదండం, సాంబశివరావు మంచి స్నేహితులు.. ఈ రోజు నుంచి కాదు స్కూలు స్థాయి నుంచి, ఒకే కాలేజి చదివారు. వేరు వేరు శాఖలలో ఉద్యోగాలు చేసినా, ట్రాన్స్‌ఫర్ వల్ల ఎన్ని వూర్లు తిరిగినా, అప్పుడప్పుడు కలుసుకునేవారు. సాంబశివరావుకు యిద్దరు కొడుకులు. వేరు, వేరు ప్రదేశాల్లో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు.

కోదండపాణికి ఒక కుమారుడు, ఒక కుమార్తె.

కొడుకు అమెరికాలో స్థిరపడ్డాడు. కూతురు విశాఖలో స్థిరపడింది. అల్లుడు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. కోదండపాణికి సరదాగా మాట్లాడడం, చిలిపిగా వుండడం అలవాటు.

ఇద్దరు స్నేహితులు మాట్లాడుకుని రిటైర్ అయ్యాక సొంతవూరిలోనే స్థిర పడ్డారు.

సాయంత్రం అయితే చాలు యిద్దరు కలిసి వాకింగ్‌లో పార్క్‌కు రావడం చీకటి పడగానే యింటికి పోవడం దినచర్యలో ఒక భాగం.

“ఒరే సాంబు... ఇప్పుడు చూడరా... ఈ కుర్రాడు ఓ కుర్రదాన్ని పట్టాడు. వారి ప్రేమ చెట్లు చిగిర్చినట్టు, చిగురించి, ఆకులు రాలేటప్పటికీ వారి ప్రేమ రాలిపోతుంది” అన్నాడు కోదండపాణి.

అబ్బా ఆపుతావా... కోదండం... నీ కో దండం!

పోదాం వద యింటికి... అన్నాడు సాంబశివరావు.

“ఎక్కడికి” అన్నాడు కోదండం.

“ఇంకెక్కడికి యింటికి”

"టైం ఎంతనుకున్నావు?"

ఏడు...

"అప్పుడే వెళ్ళి ఏం చేస్తావ్?"

'ఏదోకటి చేస్తాను'.

"ఒరే... మీ ఆవిడ అప్పుడే చపాతీలు చేసి వుండదులేరా... కాసేపాగి పోదాం... కూర్చో... అంటూ వేళాకోళం చేసేడు కోదండం.

"ఒరే... కోదండం వేరే టాపిక్ మాట్లాడురా..." మన వయసేంటి?

"ఒరే... సాంబు ఇటు కూర్చో... అటు చూడు.. చెట్టు ఎలాగుంది?"

"నిండా ఆకులతో పచ్చగా వుంది".

"కాని చెట్టుకు మాత్రం ఎన్నో సంవత్సరాల వయసున్నంది. చెట్టు పెరిగి పెద్దదై ఎన్ని సంవత్సరాలు అయినా కాలానుగుణంగా ఆకులు చిగుర్చి చల్లగా గాలినిచ్చి, నీడనిచ్చి, చివరగా ఆకులు పండి రాలిపోతుంది. చెట్టు మొండిగా నిలుస్తుంది".

"అంటే ముసలిదై మనలా వుంటుంది" అన్నాడు సాంబశివరావు.

"కాని వసంత ఋతువుకు మళ్ళీ ఆకులు చిగుర్చి, పచ్చగా వచ్చేస్తుంది" మనమంతేరా... ముసలివాళ్ళ మయిపోయామని, ఏమీ చేయలేమని అనుకుంటే అలాగే వుంటుంది. మళ్ళీ మనమే ఉత్సాహం నింపుకొని, చురుగ్గా వుండాలి" అన్నాడు కోదండం.

అంటే మళ్ళీ పెళ్లి చేసుకొని పిల్లలను కని వచ్చగా వుండమంటావా? అన్నాడు సాంబశివరావు.

"అదీకాదురా... చెట్టు ఎన్ని సంవత్సరాలయినా పచ్చగా చిగుర్చిస్తుంది. మన వంశ వృక్షం విస్తరించినట్టు. అలాగే మనం ముసలి వాళ్ళం అయితే మనస్సు వసంత ఋతువులా వుండాలి అంటాను".

"ఓహో... అదా!"

"అర్థం అయిందా"

అర్థం అయింది. చీకటి పడింది పద... చెల్లెమ్మ ఎదురు చూస్తూ వుంటుంది అన్నాడు సాంబశివరావు.

"సరే పదా... అందుకేరా... ప్రేమకు వయస్సు, మనస్సుతో నిమిత్తం లేదు.."

"ఏమోనాయనా... నాకు తెలీదు. నీది ప్రేమ వివాహం కదా. అందుకే నీకే ఎక్కువ తెలిసి వుంటుంది ప్రేమ గురించి".

యిద్దరూ నవ్వుకుంటూ, అప్పటి విషయాలు జ్ఞాపకం చేసుకుంటూ యిళ్లకు బయలు దేరారు.

"ఏమండి... నాగరాజు అన్నయ్య వచ్చిపోయారు" అంది రాజరాజేశ్వరి.. కోదండ పాణి భార్య.

"మరీ... పార్కుకు వెళ్ళారని చెప్పి, అక్కడికి పంపలేకపోయావా?" అన్నాడు కోదండం.

"మరే అన్నయ్యగారు వచ్చింది తీరిగ్గా కూర్చుని బాతాఖానీ చేయడానికి కాదు".

"మరెందుకు...?"

"అమ్మాయి పెళ్లి శుభలేఖ యిచ్చి వెళ్ళారు

"ఎప్పుడు?"

"వచ్చే గురువారం ఉదయం 10.00 గంటలకు"

"శుభలేఖ అక్కడే వుంది చూడండి" అంది టివి వైపు చూపిస్తూ....

☆☆☆

"గురువారం"...

కోదండపాణి భార్యతో సహా బయలుదేరాడు.

సాంబశివరావు ఒక్కడే వచ్చాడు పెళ్ళికి, నాగరాజు కోదండపాణి ఆఫీసులో పని చేసేవాడు. అలా పరిచయం సాంబశివరావుకు కూడా.

నాగరాజు రిటైరైపోయారు. చిన్నమ్మాయి పెళ్ళి బాగా జరిపిస్తున్నాడు నాగరాజు స్వాగతం పలికేడు అందరికీ.

ముగ్గురూ పెళ్ళి మండపంలో కూర్చున్నారు.

పరిచయస్తులు కోదండపాణిని పలుకరిస్తున్నారు.


---

## వెన్నెల

వెన్నెల్ని మడతపెట్టి
దాచుకుందామని
ఆ కెరటాలికి ఎంతాశో!

-ఏ.వి. ఆర్. మూర్తి

---



ముహూర్తం దగ్గరపడింది.

"అమ్మాయిని పిలుచుకురండి" అంటూ పురోహితుడు అరుస్తున్నాడు.

మంత్రాలు చదువుతూ...

కళ్యాణ మండపం బాగా అలంకరించారు.

పెళ్లి కుమార్తెను బాగా అలంకరించుకొని తీసుకువచ్చారు.

"ఒరే... సాంబు ఈ అమ్మాయిని ముందు

ఎక్కడో చూసినట్టు వుంది కదూ... అన్నాడు కోదండం. పక్కనేవున్న సాంబశివరావుతో ...

"నాకూ అలాగే అనిపిస్తుంది"

"ఏమిటండీ... మీ గుసగుసలు"

"ఈ అమ్మాయిని ఎక్కడో చూసినట్టు వుంటేను".

"ఎక్కడో బజారులో చూసి వుంటారులేండి.."

"కాదు... రాజీ... ఆ సాంబు.. గుర్తుకు వచ్చింది.

"ఈ అమ్మాయి మన పార్క్‌లో వేరే కుర్రాడితో వచ్చేదికదా...

"సరే ఆ విషయం మనకెందుకు... నోరు మూసుకొని కూర్చో... అన్నాడు సాంబశివరావు.

"ఒరే... ఎంత అన్యాయం? పెళ్లికానీ ఈ విషయం అమ్మాయిని అడుగుతాను" అన్నాడు కోదండం.

విషయం తెలుసుకున్న రాజరాజేశ్వరీ...

"సరేలెండి... విడ్డూరం... మనకెందుకు, నోరుమూసుకొని పదండి"

అదికాదు... రాజీ... ప్రేమ ఒకరితో.. పెళ్ళి మరొకరితో..

"సరేల్లేండీ... మన రోజులు వేరు".

"పదండి... అక్షింతలు వేద్దాం" అన్నాడు సాంబశివరావు.

అందరూ అక్షింతలు వేసి... కాసేపు గడిచాక.. భోజనాలు కానిచ్చి... బయటికి నడిచేరు. నాగరాజు దగ్గర సెలవు తీసుకొని... మౌనంగా నడుస్తున్నాడు కోదండ పాణి...

"ఒరే... ఎందుకురా.. ఆలోచిస్తావు... ఆటో ఎక్కి యింటికి పద... అన్నాడు సాంబశివరావు... మళ్ళీ తనే అన్నాడు.

"నువ్వేకదరా... చెప్పేవాడివి... ప్రపంచీకరణలో ప్రేమ ఒక పావులా మారిందని.. ఇదీ అంతే ఋతువులా ప్రేమ మారుతుంటుంది".

రోజూలాగానే కోదండపాణి, సాంబశివరావులు సాయంత్రం పార్క్ వైపు వచ్చారు.

"ఏంటి? యింకా ఆ విషయం ఆలోచిస్తున్నావా? మాట్లాడడం లేదు. ఎందుకు?" అన్నాడు సాంబశివరావు.

"ప్రేమను ప్రేమగా చూడకుండా ఓ పావులా చూస్తున్నారా".

"సరే వదిలేయ్ విషయం" అన్నాడు సాంబశివుడు.

యిద్దరూ పార్క్‌లోకి ప్రవేశిస్తున్నప్పుడు కుర్రాడిని గమనించాడు కోదండం.

"సాంబు అటు చూడు, ఆ అబ్బాయి కదా, ఆ అమ్మాయితో తిరిగింది'

"ఆ ఆ కుర్రాడే అనుకుంటా".

"పిలువ్".

"ఒరే కోదండం మనకెందుకురా" అంటుండగా కోదండం పిలిచాడు ఆ కుర్రాడిని.

"కూర్చో బాబు" అన్నాడు కోదండం పక్కబెంచీ చూపిస్తూ.

ఫర్వాలేదులేండీ సర్. విషయం చెప్పండి. ఏదన్నా హెల్ప్ కావాలా? అని అడిగేడు.

"ఆ... అదీ కాదు. బాబూ మొన్నటివరకు ఒక అమ్మాయితో తిరిగేవాడివి కదా,

ఆ అమ్మాయికి పెళ్ళి అయిపోయింది. ఈ విషయం తెలుసా!... అంటూ సంశయిస్తూ అడిగేడు కోదండం.

"తెలుసు"

"మరి నీకు బాధగా లేదా"

"ఎందుకు సర్... అదంతా మామూలే సార్. నాకన్నా మంచి పొజిషన్. ఫారిన్ గై దొరికాడు. పెళ్ళి చేసుకుంటాను అంది" ఓ.కే. అన్నాను.

ఎవరి లైఫ్ వాళ్ళది సార్. మనం ప్రతిదానికి ఫీల్ కాకూడదు సార్... లేకుంటే ముందుకు పోలేం సార్... ప్రతిదీ ఫాస్ట్‌గా ఆలోచించాలి సార్" అంటుంటే.

ఆశ్చర్యంగా కుర్రాడి వంక చూడడం సాంబు. కోదండం పని అయింది.

"బై" సర్ అంటూ వెళ్ళిపోతుంటే ఒక్క క్షణం వులిక్కిపడి ఈ ప్రపంచంలోకి వచ్చారు.

"అందుకేరా... ఈ ప్రపంచీకరణలో 'ప్రేమ' ఋతువులు మారినట్టు మారుతూ వుంది" అనుకున్నాడు మనసులో కోదండం.

■